క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



ధరూరు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని అల్లపాడు గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలోని మెడికవర్ ఆసుపత్రి వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు హనుమంతునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రతాప్, వెంకటేష్‌నాయుడు, రామునాయుడు, రామకృష్ణ, గోపాల్ రెడ్డి, తిరుమల్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ వేసిన చెత్త అక్కడే



గట్టు: మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు పడకేశాయి. వీధుల్లోని చెత్త తొలగించే పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో వీధుల్లో చెత్త పేరుకు పోయి, ఆయా కాలనీలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ ఆవరణ, సంత బజారులో చెత్త పేరుకుపోయినట్లు కాలనీ వాసులు తెలిపారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్త తొలగింపు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలి



ధరూరు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల విద్యాధికారి రవీంద్రబాబు ధరూర్, మన్నపురం, ఉప్పేర్, నెట్టెంపాడు, మార్లబీడు, కేజీబీవీ, పాఠశాలను సందర్శించి పాఠశాల స్థితిగతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్లేగ్రౌండ్, ప్యూరిఫైడ్, వాటర్‌ప్లాంట్ డిజిటల్ క్లాస్ రూం పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిరసన

రాజోళి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై న్యాయం జరిగేదాకా పోరాడుతామని స్థానిక పాస్టర్లు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మృతిపై నిరసన తెలియజేశారు. ఆర్డీటీ కాలనీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రవీణ్ మృతిపై విచారణ చేసి న్యాయం చేయాలన్నారు. తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందచేశారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

రాజోళి: గ్రామ పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. వేతనాలు అందకపోవడం వలన కార్మికుల కుటుంబాలు గడవటం కష్టంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యేసేపు, మాదన్న తదిదరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గద్వాల క్రైం: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కరీంనగర్ జిల్లా గట్ల నర్సింగపూర్‌కు చెందిన సునీత (35) భర్త సతీష్‌కుమార్‌తో కలిసి పట్టణంలోని రెండో రైల్వే గేట్ సమీపంలోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా మార్చి 31న ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో సునీత ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన స్థానికులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సునీత సోమవారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

శిథిలావస్థలో సివిల్ సప్లయ్ గోదాం

- 2 మున్సిపాలిటీలు, 5 మండలాలకు ఒక్కటే
- ఏళ్ల తరబడి అద్దె భవనంలోనే
- సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులు



చౌకధర సరుకులు నిలువచేస్తున్న అద్దె గోదాం

అయిజ: ప్రభుత్వం పేద ప్రజలకు చౌకధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తుంది. అదే విధంగా త్వరలో వంట సరుకులు అందజేస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సరుకులు నిల్వ చేసేందుకు పౌరసరఫరాల శాఖకు సంబంధించిన గోదాం మండలానికి ఒకటి కూడా లేకపోవడంతో పౌరసరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు వాపోతున్నారు.

అద్దె భవనంలోనే

మండలంలో సివిల్ సప్లయ్ గోదాం లేకపోవడంతో మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డ్‌కు సంబంధించిన గోదాంను సివిల్ సప్లయ్ అధికారులు అద్దెకు తీసుకున్నారు. ఏళ్లతరబడి ఆ గోదాంలోనే సరుకులు నిల్వ చేస్తున్నారు. అద్దె భవనానికి ప్రతినెల రూ.5,000 అద్దె చెల్లిస్తున్నారు. అయిజ, వడ్డెపల్లి మున్సిపాలిటీలతోపాటు అయిజ, వడ్డెపల్లి, రాజోళి, మల్దకల్, గట్టు మండలాల చౌకధర దుకాణాలకు సరఫరా చేయాల్సిన బియ్యాన్ని కూడా ఇదే గోదాంలో నిల్వ చేస్తుండటంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

నెలకు 5 లక్షల క్వింటాళ్లు

ప్రతినెల గోదాంకు సుమారు 5లక్షల క్వింటాళ్ల బియ్యం వస్తుంటాయి. నిల్వ చేసేందుకు గోదాంలో స్థలం చాలక పోవడంతో 4 నుంచి 5 విడుతలుగా నిల్వ చేస్తున్నారు. వచ్చిన సరుకులు వచ్చినట్లే చౌకధర దుకాణాలకు తరలించి మిగిలిన సరుకులు అనేక దఫాలుగా గోదాంలో దింపుకోవడానికి ఇబ్బందులు పడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. చౌకధరల దుకాణాల నిర్వాహకులకు సరైన సమయంలో సరుకులు చేరకపోవడంతో వినియోగదారులకు సరైన సమయంలో సరుకులు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గోదాంలు ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజలు పేర్కొన్నారు.

కొత్తది ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలోని ప్రస్తుతం నిర్వహిస్తున్న గోదాం శిథిలమైంది. దాని స్థానంలో కొత్త గోదాం నిర్మించాలి. ఇప్పుడున్న గోదాం కూడా చిన్నగా ఉండడంతో లారీల్లో తెచ్చిన సరుకులు నిల్వ చేసుకునేందుకు వీలుకావడం లేదు. గోదాంలో నిల్వ చేసిన బియ్యం బస్తాలు కొన్ని చౌకధరల దుకాణాలకు తరలిస్తేగాని మిగిలిన చౌకధర దుకాణాలకు సరిపడా బియ్యం బస్తాలు నిల్వ చేసుకునేందుకు వీలుకావడం లేదు.

-రాంబాబు, అయిజ

మండలానికి ఒకటి నిర్మించాలి



రెండు మున్సిపాలిటీలు, ఐదు మండలాలకు కలిపి అయిజలో ఒకటే గోదాం ఉంది. అది కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఒక్కటే గోదాం ఉన్నందున సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. చౌకధరల దుకాణాలకు సరైన సమయంలో సరుకులు దింపడం లేదు. దీంతో వినియోగదారులకు సరుకులు ఆలస్యంగా పంపిణీ చేస్తున్నారు. మండలానికి ఒక గోదాం నిర్మిస్తే బాగుంటుంది.

- సోమశేఖర్, గుడెందొడ్డి

ప్రతిపాదనలు పంపించాం

ఒక్కటే గోదాం ఉండడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో బియ్యం బస్తాలు నిల్వ చేసుకోవడానికి ఇబ్బందిగా ఉంటుంది. ఉన్న ఒక్క గోదాం కూడా శిథిలావస్థకు చేరుకుంది. అదనంగా గోదాంలు నిర్మించాలని ఐదు సంవత్సరాల క్రితం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం భూమిని కేటాయించి నిధులు మంజూరు చేస్తే కొత్త గోదాం నిర్మిస్తాం.

-ప్రశాంత్‌గౌడ్, సివిల్ సప్లయ్ ఆర్ఐ

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ హేమలత

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్ర పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సీడీపీఓ హేమలత అన్నారు. సోమవారం మల్దకల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం -3లో గర్భిణులు, బాలింతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మల్దకల్ ప్రాజెక్ట్ పరిధిలోని గట్టు, మల్దకల్, అయిజ అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా గ్రామాల్లో పోషణ పక్షోత్సవాలు నిర్వహించాలన్నారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి వారి ఎదుగుదలకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా గర్భిణుల్లో రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. గర్భిణులు నెలనెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పోషకాలు ఎక్కువగా ఉండే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

వికసిత భారతే లక్ష్యం



షాబాద్‌లో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

అయిజ/ఎర్రవల్లి/ ఇటిక్యాల/ శాంతినగర్: వికసిత భారతే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రం, వివిధ గ్రామాల్లో సోమవారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి అయన నివాసంలో బీజేపీ జెండా ఆవిష్కరించారు. మండలంలోని వెంకటాపురంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివారెడ్డి, భీమసేన్ రావు, వెంకటేష్, రాజశేఖర్, పరుశరామ్, నరసింహ, వీరయ్య ఆచారి, శివరాముడు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఇటిక్యాల మండల పరిధిలోని షాబాద్ గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు షేక్ అబ్దుల్లా ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు హాజరై 44వ పోలింగ్ కేంద్రంలో బీజేపీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేకే రెడ్డి, పరుశురాం, కళ్యాణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

◆ ఎర్రవల్లి మండల పరిధిలోని వేముల గ్రామంలో బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి 33వ పోలింగ్ కేంద్రంలో బీజేపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, రామిరెడ్డి, శివ, నవీన్, ఉదయ్, పరుశ, రాజు, యశ్వంత్, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

◆ వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో బీజేపీ జెండాను పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్ ఆవిష్కరించారు. పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రామకృష్ణ, బీజేవైఎం వెంకటేష్, ఓబీసీ మోర్చా అయ్యారాజు, పట్టణ ఉపాధ్యక్షుడు మోహన్, రవి, బూత్ అధ్యక్షుడు శివుడు, శేఖరాచారి, పరశురాముడు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపడమే ధ్యేయం



లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేస్తున్న సరిత

కేటీదొడ్డి: కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం తెలంగాణలోని పేదవారు కడుపు నింపుకోవడమే కాదు.. సంపన్నులు తినే బియ్యం తింటున్నారని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలో హరిజన ముద్దమ్మ, తిప్పన్న ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి ప్రభుత్వం అందించిన సన్న బియ్యంతో వడ్డించిన భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదవాడి ఇంట్లో సన్నబియ్యంతో అన్నం రుచిని స్వయంగా చూడటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జంగిలప్ప, మహదేవ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో చేయూత



అలంపూర్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు చేయూతనిస్తాయని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అయిజ మున్సిపాలిటీకి చెందిన ఉప్పరి శ్రీనుకు రూ.19 వేలు, కుర్వ మద్దమ్మకు రూ.28,500, ఇటిక్యాలకు చెందిన విశ్వనాథ్‌కు రూ.36,500, అలంపూర్ మండలం కాశాపురానికి చెందిన వీరాచారికి రూ.60,000 విలువైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, పీఏసీసీఎస్ మాజీ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, రాముడు, నాయకులు మజీద్ మియా తదితరులు పాల్గొన్నారు.

వైద్యులను నియమించాలి



అయిజ: అలంపూర్ చౌరస్తాలోని 100 పడకల ఆస్పత్రిలో వైద్యులు లేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే వైద్యులను నియమించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ జ్యోతికి వినతి పత్రం అందజేశారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి తీసుకపోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, నాగరాజు, శేఖర్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



అయిజ: మండల పరిధిలోని ఈడుగోనిపల్లిలో నిర్వహించిన అంతర్రాష్ట్ర మహిళా కబడ్డీ పోటీలు ముగిశాయి. విజేతలకు సోమవారం నిర్వాహకులు బహుమతులు అందజేశారు. గుజరాత్ టీం ప్రథమ బహుమతి రూ.40 వేలు, ఆంధ్రప్రదేశ్ చిత్తూరు టీం ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తమిళనాడుకు టీం నాల్గవ బహుమతి రూ.20 వేలు, తిరుపతి టీం 5వ బహుమతి రూ.10వేలు, కర్నాటక టీం 6వ బహుమతి రూ.5 వేలు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు బడేసాబ్, వెంకన్న, ఉరుకుందు, రామాంజనేయులు, మల్దకల్, వెంకట్రాములు, చంద్రశేఖర్, వెంకటేష్, నాగేష్, హనుమంతు, నరేష్, పల్లేష్, పరమేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బలవంతపు పన్ను వసూళ్లు ఆపాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అలంపూర్: రాజీవ్ యువవికాసం పథకం ద్వారా ఉపాధి కోసం దరఖాస్తు చేస్తున నిరుద్యోగుల నుంచి బలవంతపు పన్ను వసూళ్లు ఆపాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.రాజు, జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ వెంకట్రాములుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలో మున్సిపల్ సిబ్బంది దరఖాస్తులు చేస్తున్న నిరుద్యోగుల నుంచి బలవంతంగా ఇంటి పన్ను వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటి పన్ను కట్టిన వారి దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ అధికారుల తీరు వల్ల చాలా మంది నిరుద్యోగులు స్వయం ఉపాధి అవకాశాలకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని రాజీవ్ యువ వికాస పథకం కింద దరఖాస్తులు చేసుకుంటున్న నిరుద్యోగుల నుంచి బలవంతంగా ఇంటి పన్ను వసూలు చేయడం ఆపాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయన్న, నాయకులు నరసింహ్మ, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో చారిత్రక కట్టడాలు



ఆలయ ప్రాంగణంలో బీజేపీ నాయకులు

రాజోళి: రాజులు పాలించిన రోజులకు ఆనవాలుగా నిలిచిన పురాతన కోటలు, బురుజులు, ఆలయాలకు రక్షణ కల్పించకపోతే చరిత్ర మొత్తం చెదలు పట్టిపోతుందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వైకుంఠ నారాయణస్వామి ఆలయం, పరిసరాలల్లోని కోట బురుజులు, పాతకాలం నాటి వాకిళ్లు, కోటగోడలు, ప్రహరీలను ఆయన పరిశీలించారు. వాటిని కాపాడుకునే బాధ్యత అందరిపైనా ఉందని, ప్రత్యేకించి ప్రభుత్వంపై ఉందన్నారు. రాజోళి సంస్థానాన్ని పాలించిన రాజు పెద్ద సోమభూపాలుడు స్థానికంగా ఎన్నో చారిత్రక కట్టడాలు నిర్మించారని అందులో వైకుంఠ నారాయణస్వామి ఆలయాన్ని ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. ఎంతో విశిష్టత కలిగిన కట్టడాలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. రాళ్లు కూలిపోయి, గోడలు పగుళ్లు వచ్చి, నేల రాలుతున్నా పట్టించుకునే వారేలేరని మండిపడ్డారు. వైకుంఠనారాయణ స్వామి ఆలయానికి ఇనామ్‌గా ఇచ్చిన వందలాది ఎకరాల భూమి కబ్జాకు గురైందని మండిపడ్డారు. అధికారులు విచారణ చేసి, భూములను ఆలయ నిర్వహణకు, ధూపదీప నైవేద్యాలకు అందేలా చూడాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శశికుమార్, సంజీవరెడ్డి, అంజి, గోవిందు రాజులు, నాయకులు శివారెడ్డి, రాజగోపాల్, రాజశేఖర్ తదిదరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఇటిక్యాలలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డాక్టర్ రాధిక

గట్టు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని భవిష్య భారత్, ఎల్‌టీఐమైండ్‌ట్రీ సంస్థ డీపీఎం ఆనంద్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సోమశేఖర్, విజయమ్మ, ప్రోగ్రాం ఆఫీసర్ ముని, సీఓ హలీంపాష తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక ఆరోగ్య సమస్యలపై మాట్లాడారు. మంచి ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత పాటించాలన్నారు. మంచి ఆరోగ్యం కోసం బ్యాలెన్స్‌డ్ ఆహారం ఎంత ముఖ్యమో వ్యాయామం కూడా అంతే ముఖ్యమన్నారు. రోజుకు కనీసం ఏడెనిమిది గంటలు నిద్రపోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తబాసుమ్, సిబ్బంది అనిరుధ్, సత్యమ్మ, శోభారాణి, ప్రభాకర్, పురుషోత్తం, భారతి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండ్ల గిరక పోటీలు



పోటీలో తపలపడుతున్న వృషభాలు

అయిజ: మండలంలోని యాపదిన్నె గ్రామంలో సోమవారం ఎద్దుల గిరక బండ్ల పోటీలు నిర్వహించారు. మండలంలోని కురువపల్లి, యాపదిన్నె గ్రామాలకు చెందిన 9 జతల ఎద్దులు పోటీలో పాల్గొనాయి. మొదటి బహుమతి వెంకట్రాములు, ద్వితీయ బహుమతి రంగన్న, తృతీయ బహుమతి అల్లిబాబు, నాల్గవ బహుమతి వీరేష్, ఐదవ బహుమతి వేణుకు చెందిన ఎద్దులు కైవసం చేసుకున్నాయి. ఎద్దుల యజమానులకు దాతలు కృష్ణారెడ్డి, మద్దిలేటి, రంగన్న, యుగంధర్ రెడ్డి, కృష్ణస్వామి, తిరుమలరెడ్డి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాన్ని తరలించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అయిజ: సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాన్ని పట్టణంలో ఏర్పాటు చేయాలని మండల అఖిలపక్షం కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో బాలుర గురుకుల విద్యాలయాన్ని పట్టణంలో నిర్వహించారని, మౌలిక వసతులు లేవనే కారణంతో ఎర్రవల్లి చౌరస్తాకు తరలించినట్లు తెలిపారు. అయిజ శివారులో గురుకుల పాఠశాల కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారని, అక్కడ గురుకుల పాఠశాల భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్షం కమిటీ నాయకులు వెంకట్రాములు, ఆంజనేయులు, తాహేర్, పల్లయ్య, వీరయ్య శెట్టి, హనుమంతు, మారెప్ప, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణంపై ఫిర్యాదు

గట్టు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వేసిన సీసీరోడ్లు నాణ్యత లేకుండా చేపట్టినట్లు సోమవారం చిన్నోనిపల్లెకు చెందిన వీరేష్, అంతంపల్లికి చెందిన ఆంజనేయులు, రాముడు, దుబ్బన్న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గట్టు మండలంలోని బోయలగూడెం, అంతంపల్లి, చాగదోన, ఇందువాసి, ముచ్చోనిపల్లె, రాయాపురం, గొర్లఖాన్‌దొడ్డి గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సీసీరోడ్లను నాణ్యత లేకుండా నిర్మించినట్లు తెలిపారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. సీసీరోడ్ల వ్యవహారంపై అధికారుల చేత విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా కోదండరాముడి పట్టాభిషేకం



పట్టాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో కోదండరాముడి ఆలయంలో పట్టాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం పట్టాభిషేకం చేశారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు.

భూవివాదంపై డీఎస్పీకి ఫిర్యాదు

గద్వాల క్రైం: భూమి వివాదంపై సోమవారం డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పట్నం సత్యనారాయణ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సర్వే నంబర్ 730, 733లో 18- 24 గుంటల భూమిలో కుటుంబ సభ్యులకు సైతం భూమి ఉంది. భూమి పరిష్కారం కోసం సర్వే చేయాల్సిందిగా కుటుంబ సభ్యుడైన పట్నం శేషాద్రితో మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. అయితే బలవంతంగా సర్వే చేయించేందుకు, మాపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు స్టేషన్ అధికారితో కుటుంబ సభ్యులు కలిసి సర్వేకు అభ్యంతరం చెప్పవద్దని చెప్పించే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. ఇట్టి విషయంపై న్యాయ విచారణ జరిపించాల్సిందిగా డీఎస్పీ మొగిలయ్యకు ఫిర్యాదు చేశామన్నారు. గతంలో జిల్లా కేంద్రంలోని సర్వే నంబర్లు 730, 733లోని 18-24 గుంటల భూమి విషయంపై ముస్లిం మైనార్టీ బాధితుడు ఇనాం భూములను కైరాత్ ఇనాం భూములుగా కొందరు తప్పుడు డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలతో ఓఆర్‌సీ చేసుకున్నట్లు హైకోర్టులో కేసు దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ భూ వివాదం మరోసారి తెరపైకి రావడం కొసమెరుపు.